


యార్డుకు 1,16,066 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు బుధవారం 1,16,066 మిర్చి బస్తాలు రాగా, ఈ-నామ్ విధానం ద్వారా 1,13,746 బస్తాలు అమ్మకాలు జరిగాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 520.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 824.10 అడుగుల వద్ద ఉంది.



విశ్వేశ్వరస్వామి కల్యాణం

పాత గుంటూరు: బ్రాడీపేట గౌరీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో స్వామి జన్మనక్షత్రం పురస్కరించుకొని బుధవారం కల్యాణం వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

గొప్ప దార్శనికుడు అంబేడ్కర్



విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి రజిని

నెహ్రూనగర్ : పరిపాలన ఎలా ఉండాలో, ప్రజాస్వామ్యం ఎలా పనిచేయాలో ముందే ఊహించి చెప్పిన గొప్ప దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరులోని కొరిటెపాడు సెంటర్‌లో బుధవారం అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాల ఏర్పాటుకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయులకు పరిచయమే అవసరం లేని పేరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. గొప్ప పరిపాలనతో ప్రతి పేద ఇంటికి దైవంగా మారిన గొప్ప నాయకుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. గొప్ప నాయకుల విగ్రహాల ఏర్పాటు ఎంతో గర్వకారణమని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యక్కలూరి మారుతి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా తరలిస్తున్న నగదు సీజ్

రూ.14.50 లక్షలు స్వాధీనం

శావల్యాపురం: ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని గంటావారిపాలెం గ్రామం జాతీయ రహదారి మార్గంలో వ్యవసాయ చెక్ పోస్టు వద్ద ఆధారాలు లేకుండా తీసుకొని వెళుతున్న రూ. 14.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ టి.తిరుపతిరావు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహన తనిఖీల్లో భాగంగా ప్రకాశం జిల్లా దోర్నాలకు చెందిన వల్లూరి ఏడుకొండలు ఏలాంటి ఆధారాలు లేకుండా తన వాహనంలో నగదు తీసుకుని వెళుతుండడంతో స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును సీజ్ చేస్తామన్నారు. నగదును ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించామన్నారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి



ఫిరంగిపురం: బాల్యవివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా నోడల్ అధికారి శ్రీవాణి అన్నారు. దీనాపూర్ క్యాంపస్‌లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం రూరల్ క్రిస్టియన్ కళాశాల, సెయింట్ జేవియర్ ఫార్మసీ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పలు రకాల ఆటలు, పాటలు, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. జాతీయ బాలిక దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ స్వర్ణలతాదేవి, సీడీపీవో పి.ప్రసూన, గుంటూరు సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ జీఏ ప్రమీల, అధ్యాపకులు పాల్గొన్నారు.

మరో 62 మంది ఎస్‌ఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరో 62 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరు జిల్లాలో 19, పల్నాడు జిల్లాలో 7, బాపట్ల జిల్లాలో 6, ప్రకాశం జిల్లాలో 12, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లాలో 13, తిరుపతి జిల్లాలో ఐదుగుర్ని బదిలీ చేశారు.

ప్రమాదాల కట్టడికి ప్రాధాన్యం

- గతేడాది గణనీయంగా తగ్గిన ప్రమాదాలు
- డ్రంకెన్ డ్రైవ్‌లో 1806 కేసులకు రూ.22.87 లక్షలు జరిమానా
- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా
- క్యాంపు కార్యాలయంలో రహదారి భద్రతపై జిల్లాకమిటీ సమావేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల అర్బన్: రహదారులపై ప్రమాదాలను పూర్తిస్థాయిలో అరికట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రహదారుల భద్రతపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగింది. ప్రజల ప్రాణాల రక్షణే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. ఏదైనా ప్రమాదాలు జరిగితే క్షతగాత్రులను సత్వరమే వైద్యశాలకు తరలించి, వారికి వైద్యం అందేలా చూడాలన్నారు. జాతీయ రహదారిపై నమోదవుతున్న ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులు మినరల్ ఫండ్ నుంచి వినియోగించాలన్నారు. రహదారి భద్రతకు సంబంధించిన నియమ, నిబంధనలపై లారీ డ్రైవర్లకు అవగాహన కల్పించాలన్నారు. వాహనాలు, డ్రైవర్ల లైసెన్సులు పునరుద్ధరణకు వచ్చే సమయంలో వాహనాల కండీషన్‌ను నిశితంగా పరిశీలించాలన్నారు. అలాగే రహదారుల భద్రత, నిబంధనలపై ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించాలన్నారు. అద్దంకి – నార్కెట్‌పల్లి జాతీయ రహదారిపై ప్రమాదాలు కొంతమేర తగ్గుముఖం పట్టాయన్నారు. 216 నంబరు జాతీయ రహదారిపై ప్రమాదాలు మరింత తగ్గేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాలు జరగడానికి కారణాలను యువతకు వివరించాలన్నారు.

2022 సంవత్సరంలో జిల్లాలో 645 ప్రమాదాలు నమోదయ్యాయన్నారు. 2023 సంవత్సరంలో 568 ప్రమాదాలు జరిగాయన్నారు. వీటిని పూర్తిగా తగ్గించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కింద గడిచిన ఏడాదిలో 1,806 కేసులు నమోదు చేసి, రూ.22.87 లక్షలు జరిమానా విధించామన్నారు. రహదారుల పక్కనున్న చిల్లచెట్లు తొలగించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. జిల్లా అదనపు ఎస్పీ పి.మహేష్, రవాణా శాఖ అధికారి ఎ.చంద్రశేఖర్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రాంబాబు, రంగారావు, సహాయ ఎంవీఐలు కిషోర్ బాబు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయాలు

మోదుకూరు(వేమూరు): పోలింగ్ బూత్‌ల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. చుండూరు మండలం మోదుకూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఐదు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ అధికారులందరు పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దుర్గ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



మోదుకూరు జడ్పీ పాఠశాలలో పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

- కవాతు రిహార్సల్స్‌ను పరిశీలించిన ఎస్పీ
- ఉత్సవాలకు ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్



కవాతు రిహార్సల్స్‌ను పరిశీలిస్తూ, గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

బాపట్లటౌన్: జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణంలో ఈనెల 26న జరగనున్న గణతంత్ర వేడుకలకు పరేడ్ గ్రౌండ్‌ను సిద్ధం చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ అధికారులు గణతంత్ర వేడుకల నిర్వహణలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా గౌరవ వందనంకు సంబంధించిన ట్రయల్ రన్ బుధవారం నిర్వహించారు. జిల్లా పోలీసులకు కవాతుపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అడ్మిన్ ఆర్ఐ ఎల్. మన్మథరావు పరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ కవాతు రిహార్సల్స్ నిర్వహించారు. రిహార్సల్స్‌ను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. అనంతరం పరేడ్ పరిశీలన వాహనంలో గ్రౌండ్‌లో పర్యటించారు. ప్రతిభ కనపరిచిన పోలీసు సిబ్బంది వివిధ పతకాలు ఏ విధంగా అందుకోవాలో డెమో నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ గణతంత్ర వేడుకలను వీక్షించేందుకు విచ్చేసే ప్రజలకు, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా తగిన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు, ఎస్‌బీ సీఐ వి.సూర్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మథరావు, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్, హోంగార్డు ఆర్ఐ ఎల్.గోపీనాథ్, పోలీసు అధికారులు, సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

దొంగఓట్ల తొలగింపుపై హర్షం

- 13 వేల ఓట్లు తొలగింపుపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఆమంచి



మాట్లాడుతున్న ఆమంచి కృష్ణమోహన్

కారంచేడు: పర్చూరు నియోజకవర్గంలో సుమారు 30 వేల దొంగ ఓట్లు ఉన్నట్లు ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి ఆధారాలు సమర్పించామని, ప్రస్తుతం నియోజకవర్గంలో 13,558 దొంగ ఓట్లు తొలగింపుపై కేంద్ర ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయంపై కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ అన్నారు.

బుధవారం కారంచేడులోని డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు దఫాలుగా పర్చూరు నియోజకవర్గంలో అనేక దొంగ ఓట్లు నమోదయ్యాయన్నారు. వీటిని ఆధారాలతో తొలగించేందుకు గ్రామస్థాయి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేశారని చెప్పారు. దొంగ ఓట్లలో కేవలం 60 శాతం మాత్రమే తొలగింపులు జరిగాయని, ఇంకా సుమారు 10వేల వరకు ఉండే అవకాశాలున్నాయని చెప్పారు. ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన ఎన్నికల కమిషన్ తెలిపిన వివరాల ప్రకారం ఒకరికి ఒక్క చోట మాత్రమే ఓటు ఉండాలని, అది కూడా ఎక్కడ నివాసముంటే అక్కడ మాత్రమే ఓటు హక్కు కలిగి ఉండాలని చెప్పారన్నారు. నివాసముండే చోట కాకుండా వేరే చోట 100 ఎకరాల భూములున్నా, సొంత ఇళ్లు ఉన్నా చెల్లవన్నారు. నివాస ప్రాంతాల్లో మాత్రమే ఓటు ఉండాలని చెప్పారు. ఇటీవల తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న వారు ఇప్పుడు మళ్లీ రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో సైతం ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి సుమారు 400 బస్సులు, కార్లలో ఓటర్లను తరలించే వారని, ఇప్పుడు కనీసం 200 వాహనాల్లో తరలించే దొంగ ఓటర్లను నిలుపుదల చేయగలిగామన్నారు. నియోజకవర్గంలో ఇంకా మిగిలి ఉన్న మరో 10 వేల దొంగ ఓట్లను కూడా తొలగించే వరకు తాము న్యాయ పోరాటం చేస్తామన్నారు. రెండు చోట్ల ఓటు హక్కు వినియోగించుకొనే వారిపై చర్యలు తీసుకొనేలా పోరాటం చేస్తామని చెప్పారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, పర్చూరు, కారంచేడు జేసీఎస్ కన్వీనర్‌లు యార్లగడ్డ శ్రీకాంత్, ముప్పాళ్ళ రాఘవయ్య, పార్టీ మండల కన్వీనర్లు దండా చౌదరిబాబు, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రమైక ధన సౌందర్యం

చేద్దామంటే పనిలేని పరిస్థితి.. తిందామంటే ముద్దలేని స్థితి.. ఆకలితో అల్లాడుతున్న పిల్లలను చూడలేక పొట్టచేత పట్టుకుని దూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి. ఈక్రమంలో బిడ్డల చదువులు అధోగతి. ఇదీ గత టీడీపీ ప్రభుత్వంలో వడియరాజుల సామాజిక వర్గీయుల పరిస్థితి. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వారి స్థితిగతులు మారాయి. నేడు చేతినిండా పని.. సమృద్ధియైన ఆహారం.. ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉండి తమ పిల్లలను చదివించుకుంటూ ఆనందంగా ఉంటున్నారు.

వడియ రాజుల ఉన్నతికి ప్రభుత్వం చర్యలు

- నాడు వలస పక్షులు.. నేడు దర్జా బతుకులు
- తెల్లరాయి క్వారీల్లో 700 కుటుంబాలకు ఉపాధి చూపించిన ప్రభుత్వం
- బిడ్డలను చదివించుకుంటూ ఆర్థికంగా బలపడుతున్న వైనం
- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన వడియరాజుల కుటుంబాలు



క్వారీలో పనులు చేస్తున్న కార్మికులు (ఫైల్)

దాచేపల్లి: గత టీడీపీ ప్రభుత్వంలో ఉపాధి దొరక్క వలస పక్షులుగా ఉన్న వడియరాజులు.. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తెల్లరాయి క్వారీల్లో ఉపాధి పొందుతూ రాజుల్లా బతికేస్తున్నారు. వడియరాజులు.. గురజాల నియోజకవర్గం దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని దాచేపల్లి, నడికుడి, నారాయణపురం, కేసానుపల్లి, గామాలపాడు గ్రామాల్లోని తెల్లరాయి క్వారీల్లో 700 కుటుంబాలకు పైగా ఈ సామాజిక వర్గీయులు ఉపాధి పొందుతున్నారు. ఈ ఐదేళ్ల కాలంలో వలసలకు చెక్ పడడంతో స్థానికంగానే ఉపాధి పొందుతూ ప్రశాంతమైన జీవితం గడుపుతున్నారు.

వలసలు నిల్.. ఉపాధి ఫుల్..

దాచేపల్లితో పాటుగా పలు గ్రామాల్లో ప్రభుత్వ అనుమతితో తెల్లరాయి క్వారీలు నిర్వహిస్తున్నారు. వడియరాజుల కుటుంబాలవారు ఎక్కువగా ఈ క్వారీల్లో పనులు చేస్తుంటారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇక్కడ తెల్లరాయి క్వారీల్లో స్థానికంగా నివశించే వడియరాజులకు ఉపాధి లభించలేదు. పూట గడవటమే కష్టంగా ఉండటంతో కన్నబిడ్డలను బంధువుల వద్ద వదిలేసి అధిక సంఖ్యలో వడియరాజుల కుటుంబాలు ఉపాధి కోసం బెంగళూరు, హైదరాబాద్, ముంబయి, చెన్నైలకు వలస వెళ్లారు. తల్లిదండ్రులు ఉపాధి కోసం వలస వెళ్లటంతో బిడ్డల చదువులు కూడా ఆగిపోయాయి. గత టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు వడియరాజులు సొంత ఊరికి దూరంగానే బతికారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రభుత్వం నుంచి తెల్లరాయి క్వారీలకు లీజులు ఇప్పించారు. మండల పరిధిలో ఉన్న ఈ క్వారీల్లో ప్రస్తుతం 700 వడియరాజుల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. క్వారీల్లో రాయి కొట్టటం, ట్రాక్టర్లు, టిప్పర్లలో లోడింగ్, ట్రాక్టర్లు, టిప్పర్ల డ్రైవర్లుగా ఎక్కువశాతం వీరు పనిచేస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు క్వారీల్లో పనిచేసి కూలి డబ్బులు తీసుకుంటున్నారు. రోజుకు సగటున ఒక్కో వ్యక్తికి రూ.600 నుంచి రూ.800 వరకు కూలి లభిస్తుంది. ఉపాధి దొరుకుతుండడంతో పిల్లలను స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తూ చదివిస్తున్నారు.

అప్పట్లో పనిలేక బెంగళూరు వెళ్లాం..



గత టీడీపీ ప్రభుత్వంలో క్వారీల్లో ఉపాధి లేక బెంగళూ రు వలస వెళ్లాం. అక్కడ కూలి పనులు చేసుకుని జీవితాలు గడిపాం. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్థానిక క్వారీల్లో ఉపాధి చూపించింది. ఇప్పుడు ఇక్కడే పనులు చేసుకుంటూ ప్రశాంతంగా జీవిస్తున్నాం.

– బత్తుల రాజు, స్థానికుడు

365 రోజులు పని దొరుకుతుంది



గత ఐదేళ్లుగా ఇక్కడ క్వారీ ల్లో పనిచేస్తున్నాం. వర్షం పడిన రోజు తప్ప మిగతా రోజులన్నీ పని ఉంటుంది. రోజుకి రూ.600కు పైగానే కూలి లభిస్తుంది. ఈ ప్రభుత్వంలో ఉపాధి కోసం వలసలు వెళ్లడం అనేదే లేదు. మాకు 365 రోజులు పని దొరకటం సంతోషంగా ఉంది.

– వల్లెపు మరియమ్మ, స్థానికురాలు

సంతోషంగా బతుకుతున్నాం



తెల్లరాయి క్వారీల్లో పనిచేసుకుని ప్రశాంతంగా బతుకుతున్నాం. గతంలో నేను ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేశాను. ఇప్పుడు డ్రైవింగ్ మానుకొని క్వారీల్లో పని చేస్తున్నాను. వారం వారం కూలి డబ్బులు తీసుకుంటున్నాం. ఉపాధికి ఢోకా లేకుండా ఉంది. ఒంట్లో ఓపిక ఉన్నంత వరకు పని చేసుకోవచ్చు.

– షేక్ హస్సన్ అహ్మద్, స్థానికుడు

క్లుప్తంగా

రాజ శ్యామల యాగానికి అంబటి మురళీకృష్ణకు ప్రత్యేక ఆహ్వానం



కొరిటిపాడు(గుంటూరు): విశాఖ శారదా పీఠంలో ఫిబ్రవరి 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న 'రాజశ్యామల యాగం'కు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణకు విశాఖ శారదా పీఠం పీఠాధిపతి ఉత్తరాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి బుధవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. విజయవాడలోని ఓ గెస్ట్ హౌస్‌లో స్వామి వారిని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ కలసి ఏడాదిగా 'జగన్నామ సంక్షేమ సంగమం' కార్యక్రమాల పరంపరను, చేపట్టిన 85 కార్యక్రమాల వివరాలను అందించారు. మానవ సేవే మాధవ సేవ అనే విధంగా రూపుదిద్దుకున్న ఈ 85 సంక్షేమ సంగమం కార్యక్రమాలను మహా స్వామి వారు ప్రశంసించడమే కాకుండా రాబోవు రోజుల్లో ఈ కార్యక్రమంలో తాను వ్యక్తిగతంగా పాల్గొని ఆశీర్వచనాలు అందిస్తానని చెప్పినట్లు మురళీకృష్ణ చెప్పారు. బజరంగ్ ఫౌండేషన్ నిర్వహణపై ముగ్ధులైన స్వామి వారు అంబటి మురళీకృష్ణను పుణ్యవస్త్రంతో దీవించి ఆశీర్వచనాలు అందజేశారు.

వైఎస్సార్ సీపీ వెంటే ప్రజలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పార్టీ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి: ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. మండలంలోని గోపాలపురం గ్రామం నుంచి ఎస్సీ కుటుంబాలు టీడీపీని వీడి సమన్వయకర్త సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని సమన్వయకర్త సాదరంగా ఆహ్వానించి కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా సమన్వయకర్త హనిమిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ఇతర పక్షాలతో కలసి వైఎస్సార్ సీపీని దెబ్బతీయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. కానీ అది సాధ్యమయ్యే పనికాదని ఎద్దేవా చేశారు. ఇప్పటికే ప్రజలంతా సంక్షేమ పాలన మళ్లీ కావాలని బలంగా కోరుతున్నట్లు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో అద్దంకితో పాటు రాష్ట్రమంతటా వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం పాటుపడి, పార్టీ కోసం పనిచేసిన వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరైన న్యాయం చేస్తారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు ప్రతిపక్షాల కుట్రలను మోసపూరిత మాటలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు చౌదరి, పార్టీ అద్దంకి పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, అవిశెన ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐక్యతతోనే ఆర్యవైశ్య సంఘం పటిష్టం

పాత గుంటూరు: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అనుబంధ సంస్థ అయిన గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం పటిష్టంగా ఉండాలంటే ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు అన్నారు. బుధవారం ఆర్.అగ్రహారంలోని గీతా మందిరంలో ఆర్యవైశ్య సంఘ సమావేశం నిర్వహించారు. సభకు సంఘ అధ్యక్షుడు ఆతుకూరి నగేష్ అధ్యక్షత వహించి మాట్లాడారు. సంఘ కాల పరిమితి మార్చితో ముగియనుందని, ఆర్యవైశ్యుల సిద్ధాంతాలు, బైలా ప్రకారం సంఘ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్బన్ జిల్లా పరిధిలో 4,800 మంది ఓటర్లు సంఘంలో నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. సంఘ మాజీ అధ్యక్షుడు టీఎల్వీ వీరాంజనేయులు మాట్లాడుతూ ఆర్యవైశ్యులందరూ సమిష్టిగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పోటీలో ఉండవచ్చునన్నారు. సమావేశంలో సంఘ మాజీ అధ్యక్షులు మున్నలూరి గౌరీ శంకర్, అన్నా పూర్ణచంద్రరావు, తూనుగుంట్ల నాగేశ్వరరావు, మొగిలి సతీష్ కుమార్, రవి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మామిడి



నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మామిడి రామారావు(రాము)ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ గుంటూరు వెస్ట్ కన్వీనర్‌గా, ప్రస్తుతం బిల్డర్స్ అసోసియేషన్ క్రెడాయ్ చాప్టర్ గుంటూరు ప్రెసిడెంట్‌గా ఉన్న రాము సేవలను గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నామినేటెడ్ పోస్టు ఇవ్వడంపై మామిడి రాము హర్షం వ్యక్తం చేస్తూ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు



పల్లెకోనలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

పల్లెకోన(భట్టిప్రోలు): రాచూరు, ఆళ్లమూడికి చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు సమక్షంలో బుధవారం పార్టీలో చేరారు. రాచూరుకు చెందిన చిలకా సలోమాన్ మద్దతురాలు చేరారు. అలాగే అమృతలూరుకు చెందిన ఎన్.దీపక్‌సాయి కూడా పార్టీలో చేరారు. వీరికి అశోక్‌బాబు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అశోక్‌బాబు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరికి వైఎస్సార్ సీపీలో న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, అమృతలూరు ఎంపీపీ రాపర్ల నరేంద్ర, రాచూరు, పల్లెకోన సర్పంచులు పెద్దిశెట్టి రాంబాబు, బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్ పాల్గొన్నారు.

తైక్వాండోలో చీరాల క్రీడాకారుల ప్రతిభ

జాతీయ స్థాయి పోటీలకు పలువురి ఎంపిక

చీరాల రూరల్: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో చీరాల క్రీడాకారులు విశేష ప్రతిభచూపారు. జాతీయ స్థాయి పోటీలకు, ఖేలో ఇండియా పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 20, 21, తేదీల్లో నంద్యాలలోని పద్మావతి ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాల, బాలికలు, క్యాడెట్, జూనియర్, సీనియర్ తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన 600 మందికి పైగా పోటీల్లో పాల్గొన్నారు. మొత్తం మీద ఆరు బంగారు పతకాలు, నాలుగు రజిత పతకాలు, తొమ్మిది కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన ఎస్‌కే తాహెర, ఎల్.కార్తిక్, మణికంఠ ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్ జిల్లాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ సలాం, ఎస్‌డీ సలావుద్దీన్ తెలిపారు. అలానే క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగంలో బంగారు పతకాలు, సిల్వర్ పతకాలు సాధించిన క్రీడాకారులు మల్లేశ్వరి, పి. భానురేఖ, వి.వినీత, సాయిప్రియ, యామిని ఫిబ్రవరి 7,8,9 తేదీల్లో పాండిచ్చేరిలో నిర్వహించనున్న ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొంటారు. అలానే ఎస్.కె.సోహెల్, ఎన్.శరత్, సీహెచ్ విజయ్‌కుమార్ సిల్వర్ మెడల్స్ సాధించారు. ఎస్.ఇందు, పి. మేరిస్టెల్లా, ఎం.విపులక్ష్మ, ఎస్‌కే హప్స, ఆర్. తనూశ్రీ, మేఘన, బ్లెస్సీ, ఎం.లీలామాధవ్, ఎస్.జస్వంత్, దుర్గారావు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. చీరాలకు చెందిన కోచ్‌లు మూడో డాన్ బ్లాక్ బెల్ట్ సయ్యద్ సలావుద్దీన్, రెండో డాన్ బ్లాక్‌బెల్ట్ సీహెచ్ వెంకట ప్రసాద్, ఒకటో డాన్ బ్లాక్‌బెల్ట్ పి.ప్రశాంత్‌బాబు పర్యవేక్షణలో క్రీడాకారులు విశేష ప్రతిభను కనబరిచారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, క్రీడాకారులకు శిక్షణనిచ్చిన శిక్షకులను జిల్లా అధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్ సలాం అభినందించారు.



ఖేలో ఇండియా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు



రాష్ట్ర స్థాయి పతకాలు సాధించిన క్రీడాకారులు

వివేకానంద స్కూల్ విద్యార్థి..

వేటపాలెం: జాతీయ తైక్వాండో పోటీలకు లేళ్ల కార్తిక్ మణికంఠ ఎంపికయ్యారు. దేశాయిపేట పంచాయతీ ఆమోదగిరిపట్నం వివేకానంద విద్యా సంస్థల్లో ఆరో తగతి చదువుతున్నాడు. విద్యార్థి అండర్ - 35 కేజీల విభాగంలో ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించినట్లు సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, జిల్లా కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ సలాం తెలిపారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో కార్తిక్ మణికంఠ పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థిని కోచ్ సయ్యద్ సలావుద్దీన్‌తో పాటు ప్రశాంత్, స్కూల్ ప్రిన్సిపాల్ బొడ్డు హరిబాబు అభినందించారు.

కర్పూరి సేవలు ఆదర్శప్రాయం

బాపట్ల అర్బన్: వెనుకబడిన తరగతుల వారి సామాజిక అభ్యున్నతికి ఎనలేని కృషిచేసిన బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు అత్యున్నత పురస్కారం భారతరత్న, కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ పేర్కొన్నారు. బిహార్ సీఎంగా రెండు పర్యాయాలు పనిచేసిన కర్పూరి ఠాకూర్ శత జయంతిని పురస్కరించుకొని అవార్డు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాజకీయ ఎత్తుగడలలో భాగంగా భారతరత్న ఇవ్వటం అందరికీ అర్థమవుతున్నప్పటికీ, వెనుకబడి వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఆయనకు పురస్కారం దక్కటం ఎంతో సంతోషకరమని చెప్పారు.

నేడు సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

- రూ.7.35 కోట్లతో నిర్మాణం
- హాజరుకానున్న మంత్రి విడదల రజిని



పిట్టలవానిపాలెం: మండల కేంద్రంలో రూ.35 కోట్లతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని గురువారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు బొలగాని సుబ్బారావు తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి హాజరవుతారని చెప్పారు. బుధవారం స్థానిక వైద్యురాలు లలిత ఏర్పాట్లను పరిశీలించారు.

గ్రానైట్ రాళ్లు తరలిస్తే చర్యలు

బల్లికురవ: గ్రానైట్ క్వారీలు పరిశ్రమలో పర్మిట్‌తోనే రాళ్లు, శ్లాబుల ఎగుమతులు చేయాలని మైన్స్ ఆర్‌ఐ బి.రాజు హెచ్చరించారు. బల్లికురవ ఈర్ల కొండ సమీపంలోని క్వారీల్లో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ క్యూబిక్ మీటర్లకు రూ.2200 నుంచి రూ.3 వేల వరకు పర్మిట్‌కు రాయల్టీ చెల్లించాల్సి ఉండగా అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. ఇటీవల బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని ప్రధాన గ్రామల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసిన అక్రమ వ్యాపారం ఆగటంలేదని చెప్పారు. దీంతో మంగళవారం అర్ధరాత్రి సంతమాగులూరు సీఐ కె. నరసింహారావు ఆధ్వర్యంలో బల్లికురవలో ఐదు లారీలను అదుపులోకి తీపుకు విజిలెన్స్ అధికారులకు అప్పగించటంతో పాటు ఐదు రెట్లు పెనాల్టీ విధించారని తెలిపారు. నెల రోజులుగా క్వారీలో, పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించి ఎగుమతులకు సిద్ధంగా ఉన్న శ్లాబులు, రాళ్లకు నెంబర్‌లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట సర్వేయర్ ఆసిఫ్ ఉన్నారు.

భారత్ గ్యాస్ ఆఫీసులో రూ.3 లక్షల చోరీ

మార్టూరు: జాతీయ రహదారిపై భారత్ గ్యాస్ ఆఫీస్‌లో ఓ వ్యక్తి చోరీకి పాల్పడి 3 లక్షల రూపాయలు దొంగిలించిన ఘటన మంగళవారం తెల్లవారుజామున జొన్న తాళి సమీపంలో చోటుచేసుకుంది. గ్యాస్ డీలరు అశోక్ తెలిపిన వివరాలు.. జొన్నతాళి సెంటరులో సర్వీసు రోడ్డు పక్కన భారత్ గ్యాస్ ఆఫీసు ఉంది. సోమవారం వచ్చిన కలెక్షన్ నగదును మంగళవారం స్థానికులకు ఇవ్వాల్సి ఉండటంతో క్యాష్ కౌంటరులో ఉంచి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో తెల్లవారు జామున 3:30 గంటల ప్రాంతంలో బైకుపై తలకు హెల్మెట్ పెట్టుకుని వచ్చిన ఓ యువకుడు షట్టరు తాళాలు ధ్వంసం చేసి ఆఫీసు లోపలికి ప్రవేశించాడు. ఇనుప రాడ్డుతో క్యాష్ కౌంటరు తాళాలు పగుల గొట్టి అందులో ఉన్న నగదుతో ఉడాయించాడు. చోరీ జరిగిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు కావడంతో మంగళవారం ఉదయం గమనించిన అశోక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చోరీ జరిగిన ప్రాంతాన్ని బుధవారం సాయంత్రం పరిశీలించిన ఎస్ఐ శ్రీనివాసరావు, అశోక్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

డీఈఓ రామారావు



మాట్లాడుతున్న డీఈఓ రామారావు

రేపల్లె రూరల్: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పీజీవీ రామారావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూరు శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వీరితో అదనపు సమయం కేటాయించి తర్ఫీదునివ్వాలన్నారు. సబ్జెక్ట్‌ల వారీగా నూరుశాతం ఫలితాలు సాధించేలా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం, జగనన్న విద్యాకానుక, విద్యాదీవెన, నాడు-నేడు అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఎంఈఓలు కేసనశెట్టి సురేష్, భూపతి హరిబాబు పాల్గొన్నారు.

సామాజిక పోరాట యోధుడు ఠాకూర్

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



వేడుకల్లో పాల్గొన్న డొక్కా మాణిక్యవరప్రసాద్, జంగా కృష్ణమూర్తి

గుంటూరు రూరల్: సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు కర్పూరి ఠాకూర్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవర ప్రసాద్ తెలిపారు. బుధవారం అమరావతి రోడ్డులోని చిల్లీస్ సెంటర్‌లో బీపీ మండల్ విగ్రహం వద్ద ఏపీ బీపీ మండల్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఠాకూర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ విగ్రహానికి, ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డొక్కా మాట్లాడుతూ ఠాకూర్ చేసిన ఉద్యమాలు కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపాయని చెప్పారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఠాకూర్ ఆశయాల సాధన దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు అడుగులు వేయాలని సూచించారు. బీపీ మండల్ విగ్రహ కమిటీ సభ్యులు మాట్లాడుతూ బిహార్ దివంగత మాజీ ముఖ్యమంత్రి ఠాకూర్‌కు భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని అందించాలని నిర్ణయించటం యావత్ జాతి గర్వించదగ్గ విషయమని చెప్పారు. డాక్టర్ ఆలా వెంకటేశ్వరరావు, డాక్టర్ శేషయ్య మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మహానేత ఠాకూర్ అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు వీ రామారావు, సీహెచ్ వాసు, శాఖమూరి సాంబశివరావు, నిడుముక్కల రాంబాబు, టి.నరసింహారావు, కె.అంకమ్మరావు, టి.కేశవ, డి.శివకుమార్ పాల్గొన్నారు.

నెహ్రూనగర్: బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కి భారతరత్న అవార్డు ప్రకటించడం బీసీ వర్గాలకే గర్వకారణమని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం లాడ్జి సెంటర్‌లో భారతరత్న అవార్డు ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు నరసింహారావు, సామాజిక న్యాయకేంద్ర కన్వీనర్ వై.కోటేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు జీఆర్ భగత్‌సింగ్, జూపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్
- రిపబ్లిక్ డే సందర్భంగా విజ్ఞాన్‌లో రక్తదాన శిబిరాలు



రక్తదాన శిబిరంలో విజ్ఞాన్ చైర్మన్ లావు రత్తయ్య, జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

చేబ్రోలు: రక్తదానం ప్రాణదానంతో సమానమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్ కుమార్ వెల్లడించారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో బుధవారం భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్, గుంటూరు జీజీహెచ్, నీడ్స్ బ్లడ్ బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వై.కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు సెకన్లకు ఎక్కడో ఒకచోట ఎవరికో ఒకరికి రక్తం అవసరం అవుతూనే ఉన్నదని తెలిపారు. విద్యార్థులు తాము రక్తదానం చేయడంతోపాటు మిత్రులను కూడా ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కోరారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని, ఎవరైనా దానం చేస్తేనే లభిస్తుందన్నారు. ప్రమాదాల సమయంలో బాధితులకు రక్తం అవసరం ఎంతో ఉంటుందని చెప్పారు. రక్తదానం వల్ల నేడు ఎంతో మందిని వైద్యులు బతికించగలుగుతున్నారని వెల్లడించారు. 500 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, డీన్లు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఎస్సీల శ్మశానవాటిక పరిరక్షణకు కృషి



శ్మశానవాటికను పరిశీలిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

తాడేపల్లి రూరల్ : చింతలపూడిలో ఎస్సీల శ్మశానవాటిక పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్సీ కమిషన్ చైర్మన్ మరుముడి విక్టర్ ప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం దుగ్గిరాల మండలంలోని చింతలపూడిలో బుధవారం తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్‌తో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీ శ్మశానవాటిక ఆక్రమణకు గురవుతోందని ఫిర్యాదు చేశారన్నారు. ఇందులో భాగంగా గ్రామానికి వచ్చి వివిధ శాఖల అధికారుల నుంచి సమాచారం సేకరిస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ మల్లేశ్వరి మాట్లాడుతూ శ్మశానవాటిక పరిరక్షణ కోసం ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే పంటలను తరలించేందుకు ఇబ్బంది పడతామంటూ రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి షెడ్యూల్ కులాల వారికి జనాభా ప్రాతిపదికన అర ఎకరం నుంచి ఎకరం వరకు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ మేరకు చింతలపూడిలోని ఎస్సీలకు అర ఎకరం కేటాయించాలని సూచించారు. ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. ఇరు వర్గాల నుంచి ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి, ఎవరికీ నష్టం జరగకుండా సమస్యను పరిష్కరించాలని తెనాలి సబ్ కలెక్టర్‌కు సూచించారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ జాన్, వీఆర్వోలు నితీష్ కుమార్, సురేష్, లక్ష్మి మంజు, సర్వేయర్లు గోపాలరావు, శ్రీనివాసరావు, మధు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.